# “వారందరు విభ్రాంతినొంది దేవుని మహిమపరచిరి”

## క్రీస్తు యొక్క స్వస్థపరచు పరిచర్య, పరిశీలన

క్రీస్తు పరిచర్యలో ముఖ్యమైన భాగము ఆయన చేసిన స్వస్థతలు అని మనం ఈ వారం చదివే భాగం సూచిస్తుంది.[1] ఉదాహరణకు, కపెర్నహూము సమాజమందిరములో, ఒక మనుష్యునిలోనుండి అపవిత్రాత్మను యేసు వెళ్లగొట్టాడు (మార్కు 1:21–28; లూకా 4:31–37). దానికి ఫలితంగా, “అందరును విస్మయమొంది ... ఆయనను గూర్చిన సమాచారము త్వరలో గలిలయ ప్రాంతములందంతట వ్యాపించెను” (మార్కు1:27, 28).

సమాజ మందిరము నుండి యేసు పేతురు, అంద్రెయుల యింటికి తన శిష్యులతో కూడ వెళ్లాడు. అక్కడ యేసు పేతురు అత్తను బాగుచేశాడు. “సాయంకాలమైనప్పుడు జనులు దయ్యములు పట్టిన అనేకులను ఆయన యొద్దకు తీసికొని వచ్చిరి. ఆయన మాటవలన దయ్యములను వెళ్లగొట్టి రోగులనెల్లను స్వస్థపరచెను” (మత్తయి 8:16; 14–17 వచనాలు, మార్కు 1:29–34; లూకా 4:38–41).

మరునాటి ఉదయమున, ఆ ప్రాంతంలో సువార్త ప్రయాణాన్ని ఆరంభించాడు (మత్తయి 4:23–25; మార్కు 1:35–39; లూకా 4:42–44).

> యేసు వారి సమాజమందిరములలో బోధించుచు, (దేవుని) రాజ్యమును గూర్చిన సువార్తను ప్రకటించుచు, ప్రజలలోని ప్రతివ్యాధిని, రోగమును స్వస్థపరచుచు గలిలయ యందంతట సంచరించెను. ఆయన కీర్తి సిరియ దేశమంతట వ్యాపించెను. నానా విధములైన రోగములచేతను వేదనలచేతను పీడింపబడిన వ్యాధిగ్రస్తులనందరిని, దయ్యము పట్టినవారిని, చాంద్రరోగులను, పక్షవాయువుగల వారిని వారు ఆయన యొద్దకు తీసికొనిరాగా ఆయన వారిని స్వస్థపరచెను. గలిలయ, దెకపొలి, యెరూషలేము, యూదయయను ప్రదేశముల నుండియు యోర్దానునకు అవతల నుండియు బహు జన సమూహములు ఆయనను వెంబడించెను (మత్తయి 4:23–25).

యేసు చేసిన అద్భుతములలో ఒకటి సమగ్రంగా వివరించబడింది: అది ఒక కుష్ఠరోగిని స్వస్థపరచుట (మత్తయి 8:2–4; మార్కు 1:40–45; లూకా 5:12–16). ఎవనితోను చెప్పవద్దని బాగుపడిన కుష్ఠరోగితో యేసు చెప్పాడు, అయితే అతడు దాన్ని ప్రచారం చేశాడు. దానితో యేసు ఎంతటి ప్రజాభిమానం చూరగొన్నాడంటే, “ఆయన ఇక పట్టణములో బహిరంగముగా ప్రవేశింపలేక, వెలుపల అరణ్య ప్రదేశములలో నుండెను. నలుదిక్కుల నుండి జనులు ఆయన యొద్దకు వచ్చుచుండిరి” (మార్కు 1:45).

బహుశా – కొంత విశ్రాంతి కొరకు ఆయన తిరిగి కపెర్నహూమునకు వచ్చినట్లున్నాడు – అయితే ఆయన ఇంటినిండా జనం గుమి గూడారు. ఇంటి కప్పుగుండా

దిగివచ్చిన మనిషిని యేసు స్వస్థపరచిన రంగం అది (మత్తయి 9:2-8; మార్కు 2:1-12; లూకా 5:17-26). "పక్షవాయువుగల వానిని చూచి - నీవు లేచి నీ పరుపెత్తికొని యింటికి పొమ్మని నీతో చెప్పుచున్నానని" ఆయన అన్నాడు (మార్కు 2:11). "తక్షణమే, వాడు లేచి, పరుపెత్తికొని, వారందరి యెదుట నడచిపోయెను గనుక, వారందరు విభ్రాంతినొంది - మనమీలాటి కార్యములను ఎన్నడును చూడలేదని చెప్పుకొనుచు దేవుని మహిమపరచిరి" అని మార్కు అంటాడు (12 వ.). "వారందరు విభ్రాంతినొంది, దేవుని మహిమపరచిరి" అని మాత్రమే KJV అంటుంది. మన పాఠం శీర్షిక ఈ పదాల్లోనుంచి తీసుకున్నది.

సువార్త రచనలను మనమింకను చదువుతూ ఉండగా, అద్భుతమైన స్వస్థతలతో పాటు ఆయన అద్భుత కార్యాలను చూస్తూనే ఉంటాం. ఆయన అద్భుతాలను మాట్లాడుకుంటూ వెళ్లడంలో కొంతకాలం గడపడం - అందులో ప్రత్యేకించి వ్యాధిగ్రస్తులను బాగుచేయడాన్ని గూర్చి చెప్పుకొనడం ప్రయోజనకరంగానే ఉంటుంది.

## యేసు అద్భుతములకు కారణాలు

యేసు నిజంగా అద్భుతాలు చేశాడన్న సంగతిని నేను నొక్కి చెప్పాలని అనుకుంటు న్నాను. మత్తయి, మార్కు, లుకా, యోహానులలో దాఖలు చేయబడినట్టే అవి జరిగాయి.

బైబిలునుగానీ, యేసు దైవత్వాన్నిగానీ నమ్మనొల్లని వారు బైబిలు అద్భుతాలను హేళనచేస్తూ ఉంటారు. "యోనాను తిమింగలం మింగడాన్ని నీవు నిజంగా నమ్ము తావా?" అని వారు అడుగుతారు. "కొన్ని రొట్టెలు కొన్ని చేపలతో 5000 మందికి యేసు నిజంగా భోజనంపెట్టాడా?" అని వారు ప్రశ్నిస్తారు. క్రైస్తవులని చెప్పుకునే కొందరు అద్భుతాలను వివరించడానికి ప్రయాసపడుతూ, ఏదో ఒక హేతుబద్ధ వివరణకొరకు ప్రయత్నిస్తారు - "ఆ కాలపు జనులు అమాయకులు. నిజంగా అద్భుతాలుకాని వాటిని అద్భుతాలన్నారు" అని అంటారు.

మరలా దీన్ని నేను స్థిరపరచుతున్నా: మత్తయి, మార్కు, లూకా, యోహానుల్లో దాఖలు చేయబడిన రీతినే యేసు అద్భుతాలు నిజంగా జరిగాయి. ఈ ప్రతిపాదన నిజమని నమ్మడానికి అనేక కారణాలున్నాయి. వాటిలో కొన్నింటిని యిక్కడ ప్రస్తావిస్తాను.

ఇది నిజమని నేనేందుకు నమ్ముతున్నానంటే, నేను దేవునియందు విశ్వాస ముంచుతాను. ఒకడు దేవుని యందు విశ్వాసముంచినట్టయితే, "దేవునికి సమస్తమును సాధ్యమ"ని అతడు నమ్మవలసియుంటుంది (మార్కు 10:27).

ఇది నిజమని నేనెందుకు నమ్ముతున్నానంటే, నేను బైబిలునందు విశ్వాస ముంచుతున్నాను. బైబిలు దైవ ప్రేరేపిత గ్రంథమని నమ్మడానికి మంచి కారణముంది (2 తిమోతి 3:16). అది నమ్మదగిన గ్రంథం, మన నమ్మకానికి నిజముగా పాత్రమైనదిగా సంవత్సరాల తరబడి నిలిచియుంది. దైవ ప్రేరేపితమైన ఈ గ్రంథము క్రీస్తు అద్భుతాలను గూర్చి తెలుపుతుంది.

నేను తరువాత చెప్పే కారణం ఇప్పుడు నే చెప్పిన దానికి దగ్గరగా ఉంటుంది:

నమ్మదగిన సాక్షులచే క్రీస్తు యొక్క అద్భుతములు దాఖలుచేయబడినందున ఇవి నిజమని నేను నమ్ముతున్నా. అవి దాఖలు చేయబడిన తీరు, దాఖలు చేయబడిన సమయాన్నిబట్టి అవి హేతుబద్ధంగా ఏమి జరిగిందో తెలిసిన వారిచే దాఖలు చేసినవే కాని ఏమి జరిగిందో ఎరుగని వారు దాఖలు చేసినవి కావని, ఎవరినీ మోసగించాలన్న ఉద్దేశం అందులో లేదని నేను నమ్ముతాను.

క్రీస్తు చేసిన అద్భుతాలు ఆయన ఎవరు? అనే విషయానికి అనుగుణంగా ఉన్నాయి గనుక నేను వాటిని నమ్ముతున్నాను – లేక, నీకు కావాలనుకుంటే, ఆయన ఏమని చెప్పుకున్నాడో దానికి అవి అనుగుణ్యంగా ఉన్నాయి. యేసు తన్ను గూర్చి – దేవుని కుమారుడని, మెస్సీయా అని, లోకమునకు వెలుగైయున్నాడని, జీవాహారమని, పాపములు క్షమింప అధికారియైయున్నాడని చెప్పుకున్నాడు. ఇవి అధికంగా చెప్పుకున్నట్లు తోచవచ్చు. అయినా, అలా చెప్పుకున్నవాడు చెప్పుకున్నవాటి విషయములో నిజమైనా చెప్పి ఉండాలి, లేక అబద్ధమైనా చెప్పి ఉండాలి. యేసు అబద్ధికుడో, వెర్రివాడో, లేక ప్రభువో – ఏదో ఒకటి అయ్యుండాలి అని ఒక వ్యక్తి అన్నాడు. ఇవి మాత్రమే ఆయన విషయంలో సాధ్యములు. యేసు అబద్ధికుడనిగాని, పిచ్చివాడనిగాని పిలవడానికి ఒకడు యిష్టపడక పోతే, – అప్పుడు అతడు ఆయనను ప్రభువుగా గుర్తించవలసియుంది – ఆ స్థితితో ఆయన అద్భుతాలు చేయడం తగినట్టుగా ఉండాలి.

ఇది నిజమని నేను ఎందుకు నమ్ముతున్నానంటే, ఆయన అద్భుతాలకు వేరుగా, ప్రభువైన యేసును గూర్చియు, ఆయన ప్రభావమును గూర్చియు వివరించడానికి వేరే మార్గము కన్పించదు. నేను ACUలో[2] విద్యార్థిగా ఉన్నదినాల్లో, "ఐతిహాసికమైన యేసును గురించిన పరిశోధన" అనేదాన్ని కొందరు వేదాంతులు నిర్వహించారు. వారు అద్భుతములయందు నమ్మికయుంచలేదు. వారి మనస్సుల్లో, "అద్భుతాలనేవి" అవివేకుల మూఢ నమ్మకాలు – క్రీస్తు కథనం నుండి అద్భుతాలను తీసేసి, "నిజమైన యేసు"ను భూ సంచారం చేసిన యేసును వారు కనుగొన తలపెట్టారు. మూర్ఖమైన, విద్యలేని, లోకంలో ఒక మూలన జీవించిన నైతిక తాత్వికుని వారు కనుగొన్నారు. ఆ "యేసు" మానవ చరిత్ర గమనాన్ని మార్చ గలిగినట్టయితే, క్రొత్త నిబంధనలో క్రీస్తునకు ఆరోపింపబడిన దంతా అద్భుతమైయుంటుందని ఒకరు చెప్పారు. J. D. Thomas అనే నా ఉపాధ్యాయులలో ఒకడు, వారు చేసిన పనిని ఎర్రగడ్డ (ఉల్లిపాయ) "ఒలిసి" అసలు లోన ఏముందో కనుగొనడానికి ప్రయత్నించడంతో పోల్చాడు. నీవు దాన్ని ఒలుస్తూపోతే అందులో మిగిలేదేమీ ఉండదు సరిగదా! ఆయన అద్భుతాలను త్రోసివేసి నీవు యేసును వివరించడం అసాధ్యం.

సువార్త రచనలలో ఉన్నట్టే క్రీస్తు అద్భుతాలు జరిగాయని నేను ఎందుకు నమ్ముతానంటే, ఆయన అద్భుతాలు చేసిన వాస్తవాలను ఆయన శత్రువులు సహా కాదనలేక పోయారు. యేసు పక్షవాయువుగల వానిని బాగు చేసిన సంఘటనకు సంబంధించిన ఈ వారపు పఠనంలో, ఆయన విమర్శకులు ఉన్నారు. ఆయన వారికి యిలా సవాలు విసిరాడు: "అయితే పాపములు క్షమించుటకు భూమిమీద మనుష్యకుమారునికి అధికారము కలదని మీరు తెలిసికొనవలెనని వారితో చెప్పి పక్షవాయువుగల వానిని

చూచి – నీవు లేచి నీ పరుపెత్తుకొని యింటికి పొమ్మని నీతో చెప్పుచున్నాననెను" (మార్కు 2:10, 11). ఆ మనుష్యుడు లేచి వారి ముందర నడిచిపోయిన దానిని వారు కాదనలేక పోయారు!

యోహాను 9కి మనం వచ్చినప్పుడు, పుట్టు గ్రుడ్డివానిని స్వస్థపరచుటను గూర్చి మనం చదువుతాం. దానిని చూచి యేసు విరోధులు అసంతృప్తి కనబరచారు. గనుక వారు ఆయనను అవమానించజూచారు. అయితే వాస్తవాన్ని వారు కాదనలేని స్థితిలోనే ఉండిపోయారు. అద్భుతం జరుగలేదని మాత్రం చెప్పడానికి వారి వశం కాలేదు (16 వ.).

యోహాను 11లో లాజరును బ్రతికించడాన్ని గూర్చి మనం చదువుతాం. యేసుని శత్రువులు ఈ విషయంలో ఏమన్నారో గమనించు: "మనమేమి చేయుచున్నాము? ఈ మనుష్యుడు అనేకమైన సూచక క్రియలు చేయుచున్నాడే" (47 వ.)

పెంతెకొస్తు దినాన, పేతురు తన సాటి యూదులకు ప్రసంగించినప్పుడు, అతడు యిలా అన్నాడు: "ఇశ్రాయేలువారలారా, యీ మాటలు వినుడి. దేవుడు నజరేయుడగు యేసు చేత అద్భుతములను, మహత్కార్యములను సూచక క్రియలను మీ మధ్యను చేయించి, ఆయనను తనవలన మెప్పుపొందిన వానిగా మీకు కనబరచెను; ఇది మీరే ఎరుగుదురు" (అపొ. 2:22). "లేదు లేదు, ఆయన చేయలేదని" కేకలు వేసి అరచిన వారెవరూ లేరు.

బైబిలు కాలంలో ప్రభువైన యేసు అద్భుతాలు చేసినట్టు జనులు కాదన లేక పోవడం మాత్రమే కాదు. క్రైస్తవ్యం యొక్క ఆరంభ దినాల్లో, క్రైస్తవ్యాన్ని రూపుమాపడానికి రచనలు చేసి ప్రయత్నించిన వారు కూడా ఉన్నారు. అయితే వీరు కాదనలేని ఒకే మినహాయింపు ఏమంటే–యేసు అద్భుతాలు చేశాడనేది.

పైగా, యేసు అద్భుతాలు అధికారపూర్వకమైనవని నేను నమ్మడానికి హేతువేమంటే, నేటికి కూడా వాటిని మనం వివరించలేం. "నిజంగా యేసు అద్భుతాలను చేసినట్టు వారు తలంచారు, యేసు ప్రజలను మోసగించినట్టే గారడీవాడైన సీమోను వంటి యితరులు కూడా అద్భుతాలు చేసినట్టు ప్రజలు భ్రమించారు" అని అనడానికి తెగించారు. వాస్తవాలు వేరుగా ఉండకపోతే, ఈలాటి వాదంలో కొంత విలువ ఉండేదే. మాబ్ సైకాలజీ ఉపయోగించి, ప్రజలను మోసగించినవారే, క్రీస్తు యొక్కయు అపొస్తలుల యొక్కయు అద్భుతమువలన ఒప్పింపబడినవారై మార్పుపొందారు కదా? అపొ. 8లోని గారడీవాడైన సీమోను కథనాన్ని పరిశీలించి చూడు. యూదాను గూర్చి కూడా ఆలోచించు. యేసు చేసినవాటి అంతర్భావాన్ని అతడు పూర్తిగా ఎరిగినవాడే. యేసు జనసమూహాలను మోసం చేస్తూ ఉన్నట్టయితే, యూదా తప్పక ఎరిగియుండేవాడే. అయినా యూదా యేసును మోసగింప తీర్మానించుకున్నప్పుడు ఆయన తీర్పులో ఆయనకు విరోధంగా నిలువగల దేనినైనా వారికి చెప్పియుండేవాడే. అయితే వారాయనను బంధించగలుగునట్లు యేసు ఎక్కడ కన్పిస్తాడో చెప్పడమే అతని వలన కుదిరింది (లేక సాధ్యపడింది).

కొందరు యిలా అభ్యంతరం తెలిపారు: "ఆ వివరణలు నమ్మదగినవైనా, ఆ సంఘటనలు నిజంగానే సంభవించినా, ఏమి జరిగిందో రాసినవారు నిజంగా అర్థం చేసికోలేదు, సైకోస్ మేటిక్ వ్యాధులను వారు ఎరుగలేక పోయారు. భౌతిక లేక

దేహసంబంధమైన సమస్యలలో 80 శాతం మానసికమైన వ్యాధులని మనకు తెలుసు. ఆ విధంగా యేసు స్వస్థపరచగలిగాడని" వారంటున్నారు.

అనేక వ్యాధులు మానసిక సంబంధమైనవి కాదని నేనెన్నడు అనను. అయితే క్రీస్తు చేసిన అద్భుతాల్లో యిది ఒక్క దానిని కూడా వివరించలేదు. ఈ వారం చదివిన దానిలో ఉన్న కుష్ఠరోగం బాగుపడడాన్ని గూర్చి యిది వివరించలేదు. కుంటుబడిన అవయవాలు పునరుద్ధరింపబడడాన్ని యిది వివరించలేదు. పుట్టు గుడ్డివానికి చూపు వచ్చిన సంగతిని యిది వివరించలేదు. మనుష్యుడు చూపుకలవాడుగా జన్మించి, ఆ తరువాత మానసిక వ్యాధిని కలిగి కంటి చూపును పోగొట్టుకున్నవాడు కాడు. అతడు పుట్టుకతోనే గ్రుడ్డివాడు. అప్పటికి చనిపోయి నాల్గు దినాలకు కంపుకొట్టుతున్న లాజరును యేసు బ్రదికించిన సంగతి ఏమి (యోహాను 11)? తాను మృతిపొంది మూడు దినాలు గడిచిపోయినదని లాజరు ఎలా అనుకోగలడు?

క్రీస్తు అద్భుతాలలో అనేకములు బహిరంగంగా చేసినవి. అవి ఒక యుగ కాలం కిందట చేసినవి. వాటిలోని శక్తి వివిధ రూపాలలో ప్రదర్శితమైంది: ప్రకృతిపైన ఆయన శక్తి, రోగము లేక వ్యాధిపై శక్తి, దయ్యములపై శక్తి, మానవజాతికి జ్ఞానానికి సంబంధించిన శక్తి, సృజించడంపై శక్తి, మరణంపై శక్తి, అనేవి కన్పించాయి. వాటిని వివరించే విధానమే లేదు.

క్రీస్తు నిజంగా జరిగించాడు ...

... కపెర్నహూము సమాజమందిరములో పక్షవాయువుగల వానిని స్వస్థపరచాడు

... ఆయన పేతురు అత్తను బాగు చేసాడు!

... గలిలయలోను – కపెర్నహూములోను తన వద్దకు వచ్చిన రోగులనందరిని ఆయన బాగు చేశాడు!

కుష్ఠ నిండిన వానిని శుద్ధునిగా చేశాడు!

... కపెర్నహూములో మంచముతో తన యెదుట దించిన వానిని బాగు చేశాడు.

## యేసు అద్భుతములలోని సత్యము

మన స్టడీలోని మిగిలిన భాగంలో, క్రీస్తు అద్భుతములను సన్నిహితంగా చూద్దాం – వాటిలో ప్రత్యేకించి ఆయన చేసిన స్వస్థతలను చూద్దాం. మన పాఠాలలో ఈలాటి స్వస్థతలు మాటిమాటికి వస్తాయి.

### అప్పుడు క్రీస్తు అద్భుతములు

నేడు "అద్భుతాలనే" పదాన్ని చాలా తేలికగా ఉపయోగిస్తాం. "అద్భుతమైన జన్మమును" గూర్చి మనం మాట్లాడతాం. "నేను నా పరీక్షలో పాసవ్వడం అద్భుతం," "అల్సర్ రాకుండ ఈ సంవత్సరం గడచిపోవడం అద్భుతం." అయితే, బైబిల్లో "అద్భుతము" అనేది ప్రత్యేకార్థంతో ఉపయోగింపబడింది. అది ప్రతిదినం జరిగే సాధారణ విషయం కాదు. అది ప్రకృతి సిద్ధమైన సూత్రమునుండిగాని, మానవ ప్రయాసనుండిగాని ఏర్పడింది

కాదు. అది మానవాతీతమైనది ప్రకృతి సంబంధమైన సూత్రాలు కొంచెం సేపు ప్రక్కకు పెట్టబడి – ప్రకృతికి అతీతమైనవి ప్రబలమై ఉంటాయి – అయితే అది అంతకంటెను మించినది. అందరు చూస్తూ, వింటూ అద్భుతం జరిగినట్టు గుర్తించుతూ ఉండేలా ప్రకృతి సంబంధమైన లోకంలో ప్రకృతికి అతీతమైన పని జరుగుతూ ఉంటుంది.

మనం మాట్లాడుతున్న దాన్ని ప్రదర్శించి చూపాలంటే – ఈ వారంలో మనం చదివిన స్వస్థతను ఉదాహరణగా తీసికొందాం. క్రీస్తు చేసిన స్వస్థతకు సంబంధించి పలు వాస్తవాలను మనం ఈ ఉదాహరణలో చూడగలం.

మొదటిగా, క్రీస్తు అద్భుతాలకు మాత్రమే పరిమితి కాలేదని గమనించు. ఆయన "కొలత లేకుండ" **ఆత్మను** కలిగి ఉన్నాడు (యోహాను 3:34).

ఇతరుల విశ్వాసమువలన ఆయన పరిమితుడై ఉండలేదు, కొన్నిసార్లు స్వస్థత నొందినవాడు, ఈ కుష్ఠరోగిలా, విశ్వాసముగలవాడై యున్నాడు (మత్తయి 8:2). ఏదియెలాగున్నా, స్వస్థతనొందిన వ్యక్తి విశ్వాసముగలవాడై ఉన్నట్టు కొన్నిసార్లు ఏ సూచనా లేదు. ఉదాహరణకు, యింటి కప్పునుండి క్రిందికి దింపబడిన వ్యక్తికి సంబంధించి, అతని నలుగురు స్నేహితుల విశ్వాసాన్ని ప్రభువు చూచాడుగాని, రోగికున్న విశ్వాసాన్ని చూచియున్నట్టు లేదు (మత్తయి 9:2; మార్కు 2:5). అందులో ముఖ్యంగా, యేసు మృతులలోనుండి ఒకని లేపినప్పుడు, చనిపోయి లేచిన వారికి ఆయన అద్భుతములు చేయగలిగినట్లు విశ్వాసముండదు కదా?

భౌతికమైన సమస్యలు ఎన్నిరకాలవైనా, స్వస్థపరచుటలో ఆయనకు పరిమితి లేదు. ఆయన ప్రతి విధమైన వ్యాధిని, ప్రతివిధమైన రోగమును బాగు చేయగలిగిన వాడు (మత్తయి 4:23).

ఈ వారపు పఠన భాగంలో, ఆయన సాధారణమైన జ్వరమును స్వస్థపరచాడు మరియు కుష్ఠరోగము కలిగిన వానిని బాగు చేశాడు. (లూకా 5:12). ఆయన బాగు చేయదలచుకొన్నవారిని ప్రత్యేకించి ఏరుకొనలేదు. బాగుచేయగల శక్తి నిజముగా ఒకడు పొంది ఉన్నప్పుడు, అతడు ఎవరిని స్వస్థపరచగలడు ఎవరిని స్వస్థపరచలేడు అనే తేడా ఉండదు.

బాగు పడగోరిన వారి సంఖ్యకు ప్రభువు పరిమితుడు కాలేదు. లేక బాగుపడు వారిచే ఆయన పరిమితుడై యుండలేదు. ఆయన వారినందరిని బాగుచేయగలిగాడు. ఆయన ఏ విధమైన అపజయాన్ని పొందలేదు.

> ఆయన కీర్తి సిరియ దేశమందంతట వ్యాపించెను. నానా విధములైన రోగముల చేతను ... పీడింపబడిన వ్యాధిగ్రస్తులనందరిని ...తీసికొనిరాగా ఆయన వారిని స్వస్థపరచెను (మత్తయి 4:24).

> ఆయన ... రోగులనెల్లను స్వస్థపరచెను" (మత్తయి 8:16)
>
> ... నానా విధరోగములచేత పీడింపబడుచున్న వారు ఎవరెవరి యొద్దనుండిరో వారందరు ఆ రోగులను ఆయన యొద్దకు తీసికొని వచ్చిరి; అప్పుడాయన వారిలో ప్రతివానిమీద చేతులుంచి, వారిని స్వస్థపరచెను (లూకా 4:40).

రెండవది, క్రీస్తు చేసిన స్వస్థతలు బహు ప్రత్యేకమైన గుణలక్షణములు గలవి:

(1) స్వస్థత వెంటనే జరిగింది. వారు క్రమేణా బాగైనవారు కారు. కుష్ఠరోగిని గూర్చి మనం యిలా చదువుతాం: "– ... తక్షణమే వాని కుష్టరోగము శుద్ధియాయెను" (మత్తయి 8:3సి; మార్కు 1:42; లూకా 5:13లను కూడా చూడు). పక్షవాయువుగలవాని గూర్చి మార్కు 2:12 యిలా అంటుంది: "వెంటనే వాడు వారి యెదుట లేచి, తాను పండుకొనియున్న మంచము ఎత్తికొని దేవుని మహిమపరచుచు వెళ్లెను ..." (లూకా 5:25 చూడు).[3]

(2) స్వస్థత సంపూర్ణమైనది. ప్రజలు పాక్షికంగా బాగుచేయబడలేదు. ఈ వారంలో మనం చదివే లేఖన భాగాలు దీన్ని ఉదహరిస్తున్నాయి. సమాజమందిరములోని మనుష్యుని నుండి దయ్యము వదలిపోయిన తరువాత అప్పుడే అతడు సంపూర్ణంగా గుణపడ్డాడు. ప్రభువు ఆమెను స్వస్థపరచిన తరువాత పేతురు అత్త సంపూర్ణంగా బాగుపడింది. ఆమె వెంటనే తన సహజమైన పనిపాటలకు వచ్చింది. కుష్ఠరోగి "మేలు పొందడం" కాదు; అతడు శుద్ధుడయ్యాడు. పక్షవాయువు గలవాడు తన పరుపెత్తికొని నడిచిపోయాడు. మనం కొనసాగించేకొలది, అనేక సంఘటనలను మనం చూస్తాం: గుడ్డివారు చూపు పొందారు, ఊచచేయి, కాలుగలవారు బాగయ్యారు, చనిపోయిన వారు బ్రదికింపబడ్డారు.

(3) స్వస్థత ఒప్పించేదిగా ఉంది. క్రీస్తు ప్రభువు చేసిన అద్భుతాలు ఎంత స్థిరమైనవంటే, ఎవ్వడూ కాదనలేనట్టుగా అవి జరిగాయి. కొందరు ప్రభువును అవమానపరచగోరి, ఆయన తన అద్భుతాలను బెయెల్జెబూలు వలన చేస్తున్నట్టు చెప్పారు; కాని అద్భుతాలు జరుగలేదని మాత్రం వారు చెప్పలేదు. దానికి ఫలితంగా జనసమూహం మరింత పెరిగింది. ప్రభువు కీర్తి వ్యాపించింది: "గలిలయ, దెకపొలి, యెరూషలేము, యూదయయను ప్రదేశముల నుండియు యొర్దానుకు అవతల నుండియు బహు జనసమూహములు ఆయనను వెంబడించెను" (మత్తయి 4:24, 25). సమాజమందిరంలో క్రీస్తు దయ్యాన్ని వెళ్లగొట్టిన తరువాత యిలా చదువుతాం:

> అందరును విస్మయమొంది – ఇదేమిటో ... ఈయన అధికారముతో అపవిత్రాత్మలకును ఆజ్ఞాపింపగా అవి ఆయనకు లోబడుచున్నవని యొకనితో ఒకడు చెప్పుకొనిరి. వెంటనే ఆయనను గూర్చిన సమాచారము త్వరలో గలిలయ ప్రాంతములందంతట వ్యాపించెను (మార్కు 1:27, 28).

ఆయన కుష్ఠరోగిని శుద్ధునిగా చేసిన తరువాత, "... ఆయనను గూర్చిన సమాచారము మరి ఎక్కువగా వ్యాపించెను. బహు జన సమూహములు ఆయన మాట వినుటకును తమ రోగములను కుదుర్చుకొనుటకును కూడివచ్చుచుండెను" (లూకా 5:15). ఈ వారపు పఠనంలో ఉన్న శ్రేష్ఠమైన ఉదాహరణ– ఇంటి పై కప్పుగుండా దింపబడినవానిదై ఉంటుంది. ఆ సందర్భంలో జరిగిన అద్భుతాన్ని ఆయన శత్రువులు సహితం కాదనలేక పోయారు.

ప్రభువు స్వస్థతలలో ఉన్న యితర విషయాలను యింకను చూడవచ్చు. మరొకదాన్ని నొక్కి చెప్పుదాం: మూడవది, క్రీస్తు ఉద్దేశం ప్రాథమికంగా ఆత్మసంబంధమైనది. ఆయన

ఉద్దేశం ఆత్మలను రక్షించడం, కేవలం బాధను తొలిగించడం కాదు. ఈ వారం నీవు చదివేదానిలో లూకా 4:43ను గమనించావా? ఆ వచనం యిలా అంటుంది: "ఆయన నేనితర పట్టణములలోను దేవుని రాజ్య సువార్తను ప్రకటింపవలెను, ఇందునిమిత్తమే నేను పంపబడితినని వారితో చెప్పెను" తాను స్వస్థపరచడానికి పంపబడినట్టు ఆయన చెప్పుకోలేదు. తన బోధనల ద్వారా జనులను రక్షించడానికి పంపబడినట్టు చెప్పుకున్నాడు (లూకా 19:10 చూడు).

మానవుని కష్టాలకు ప్రభువు చలించ లేదని దీని అర్థం కాదు. ఆయన కుష్ఠరోగిని చూచినప్పుడు, "ఆయన కనికరపడి"నట్టు చెప్పబడింది (మార్కు 1:41). అయితే క్రీస్తు యొక్క తొలి ప్రాధాన్యత స్వస్థపరచడమో, అద్భుతాలు చేయడమో కాదు. ఆయన ఎక్కువగా ఆత్మల విషయమై అక్కర కలిగియున్నాడు, శరీర విషయాలకు కాదు. ఇంటి పై కప్పుగుండా మనుష్యుడు దింపబడినప్పుడు, ప్రభువు చేసిన మొదటి పని అతని పాపములు క్షమించడం (మార్కు 2:5).

**ప్రస్తుతం అద్భుతాలనబడేవి**

కొంతవరకు ఈ తారతమ్యాన్ని చూపకుండ నేను ఈ భాగాన్ని విడిచిపెట్టలేను. ప్రజలు క్రీస్తు చేసిన అద్భుతాలను నమ్మక పోవడానికి ఒక కారణమేమంటే – ప్రభువైన యేసుకును, ఆయన అపొస్తలులకును శక్తి ఉన్నట్టే తమకు కూడా ఉన్నట్టు కొందరు చెప్పుకొనడమే. ఈ వంచకులు చేసేవాటిని సందేహవాదులు పరీక్షించినప్పుడు – అది అద్భుతం కాదని తేల్చుకొని – క్రీస్తును, ఆయన అపొస్తలులు కూడా అద్భుతాలు చేసియుండరనే తీర్మానానికి వారు వచ్చారు. ఏది యెలాగున్నా, ప్రభువు చేసిన అద్భుతాలకును నేడు అద్భుతాలు అని చెప్పబడే వాటికిని వ్యత్యాసం గమనించుదాం.

మనం ఇంతకు మునుపు చూచినట్టుగా క్రీస్తు అద్భుతాలను కావించడంలో పరిమితిని చూపలేదు. ఇతరులకున్న విశ్వాసాన్ని బట్టిగాక, శారీరక రుగ్మతను బట్టిగాక, తన వద్దకు వచ్చిన రోగుల సంఖ్యను బట్టిగాక, అతడందరికి స్వస్థతను కలిగించాడు. అందుకు భిన్నంగా ఇప్పుడెవరైనా, తమవద్దకు వచ్చిన వానికి "స్వస్థతను" కలిగించలేక పోతే తరచుగా "అతనికి తగినంత విశ్వాసం లేదు" అని అంటుంటారు. వారు తమపైన ఇతరులకున్న విశ్వాసానికి కట్టుబడినట్టుగా వర్తిస్తారు. అలా కాకుండా యేసు, ఎలాంటిదైనా, అన్ని వ్యాధులను నయం చేసాడు.

క్రీస్తు భిన్నంగా చేసిన అద్భుతాలకు సంబంధించిన మూడు ప్రత్యేక సంగతులను చూద్దాం: మొదటిగా ఆయన ఆద్భుతాలు – తక్షణమే జరిగాయి. రెండవది సంపూర్ణంగా జరిగాయి. నేడు స్వస్థతలు చేస్తామనే వారైతే యిప్పుడు కొంత మెరుగ్గా ఉన్నాడు తరువాత యింకా ఎక్కువగా బాగౌతుందని అంటారు. నీవు స్వస్థత కూటాలకు వెళ్లినట్టయితే, ఊచచెయ్యి మామూలు చెయ్యి కాదు; చనిపోయినవారు లేవరు. క్రీస్తు చేసినట్టే అద్భుతాలు చేస్తామని చెప్పుకునే వారి కార్యాలను మూడవ విశేష లక్షణం పాడు చేస్తుంది. క్రీస్తు అద్భుతాలు ఒప్పించేవిగా ఉన్నాయి; అవి సందేహ వాదులను ఒప్పించాయి. అద్భుతం జరిగినది ఎవడును కాదనలేదు. నేను "స్వస్థత సభలకు" వెళ్లాను. T Vలో అనేకమైన

వాటిని తిలకించాను. అయితే యింతవరకు ఒక అద్భుతం కూడా జరిగినట్టు నాకు కన్పించలేదు. అద్భుతాలిప్పుడు జరగటం లేదని చెప్పడం తప్పేమీ కాదు.

చివరిగా, నొక్కి పలకడంలో కూడా వ్యత్యాసముంది: ప్రభువు నొక్కి పలికింది భౌతికమైన జాడ్యం మీద కాదు, బాధ తొలిగించడంపైన కాదు. ఆయన ఒత్తి పలికేది ఆత్మసంబంధమైన దానిమీద. అయితే "స్వస్థత కూడికల్లో" నేడు కనిపించే శ్రద్ధ అంత ఉల్లాసం మీదనే.

మరలా, క్రీస్తు అద్భుతాలు చేసిన సంగతిని ఒప్పించడానికి నేడు కపటంగా జరుగుతున్న అద్భుతాలు అడ్డుకుంటున్నాయి. మోసగాళ్ళందుకు ఒకనాడు సమాధాన మిచ్చుకోవలసిన ఆవశ్యకత వస్తుంది.

## క్రీస్తు అద్భుతముల ఫలితాలు

మనం చివరిగా చెప్పే సంగతి ఇంతకుమునుపు చర్చించిన సత్యం మీద ఆధారపడి ఉంటుంది. ఈ ఆలోచనతో ముగించాలను కొంటున్నాను. ఎందుకంటే, ప్రభువు యొక్క అద్భుతాలు - అవి స్వస్థతలైనా, సముద్రాన్ని నిమ్మళింపజేయడమైనా, లేక చనిపోయినవారిని బ్రదికించడమైనా - ఆయన దేవుని కుమారుడనియు, మన రక్షకుడనియు నిరూపించడానికి ఉద్దేశింపబడ్డాయి.

ప్రభువు యొక్క అద్భుతాలు చూచిన వారి మీద అవి బహుగొప్ప ప్రాబల్యాన్ని కనుపరచాయి. ఇంటి పైకప్పుగుండా దించబడిన సంఘటననుండి దీన్ని ఉదహరించ వచ్చు, మూడు రచనలను మనము కలిపినట్టయితే, ఆ అద్భుతం ఎంతగా మనస్సుకు నాటుకునేలా కన్పిస్తుందో గమనించవచ్చు:

- వారు విభ్రాంతినొందారు (మార్కు 2:12).
- వారు విస్మయమొందారు (లూకా 5:26).
- జనులు అది చూచి భయపడ్డారు (మత్తయి 9:8).
- వారు దేవుని మహిమపరచారు (మత్తయి 9:8; మార్కు 2:12; లూకా 5:26, 27).

ఆయన నిజముగా దేవుని కుమారుడైయున్నట్టు జనులను ఒప్పించడం ఆయన అద్భుతముల యొక్క ప్రాథమిక ఉద్దేశమైయున్నట్టు క్రీస్తు నొక్కి చెప్పారు. పాపములను క్షమించు అధికారం తనకు ఉన్నదని (దేవుడు మాత్రమే చేయగలది) నిరూపించుకొనడానికి యింటి కప్పుగుండా దింపబడిన పక్షవాయువుగల వానిని ఆయన స్వస్థపరచాడు (మత్తయి 9:4-6). మన పఠనం కొనసాగే కొలది, ఈ సత్యము మరల మరల ఉదహరింప బడుతుంది. యేసే మెస్సీయ అనే సందేహం బాప్తిస్మమిచ్చు యోహానుకు వచ్చినప్పుడు, యేసు చాలామందిని స్వస్థపరచాడు. "మీరు చూచిన వాటిని యోహానుకు తెలియ జేయుడి" అన్నట్టు ఆయన వారికి తెలిపాడు (లూకా 7:20-23 చూడు).

యోహాను ప్రత్యేకంగా ఈ సంగతిని నొక్కి పలికాడు. యోహాను 2:11లోని క్రీస్తు

యొక్క తొలి సూచక క్రియ వల్ల అతని శిష్యుల విశ్వాసం బలపరచబడింది. యోహాను 5:36లో క్రీస్తు యిలా అన్నాడు "... నేను చేయుచున్న ఈ క్రియలే తండ్రి నన్ను పంపియున్నాడని నన్ను గూర్చి సాక్ష్యమిచ్చు చున్నవి." తాను చేస్తున్న క్రియలను గూర్చి తన శిష్యులతో మాట్లాడుతూ, "... యీ క్రియల నిమిత్తమైనను నన్ను నమ్ముడి" అని వారికి పిలుపునిచ్చాడు (యోహాను 14:11). "ప్రభువు చేసిన అద్భుతాలను నేను చూచియుంటే బాగుండేది అప్పుడైతే నేను గట్టిగా నమ్మేవాడను" అని నీవు అనుకోవచ్చు. దాని విషయంలో యోహాను యిలా తెలియజేశాడు:

> మరియు అనేకమైన యితర సూచక క్రియలను యేసు తన శిష్యుల యెదుట చేసెను; అవి యీ గ్రంథమందు వ్రాయబడియుండలేదు గాని యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును ఇవి వ్రాయబడెను (యోహాను 20:30, 31).

క్రీస్తు యొక్క అద్భుతాలు మరల చేయబడనవసరం లేదు. వాటిని గమనించినవారి నిశ్చయమైన సాక్ష్యం మనకుంది. వారి సాక్ష్యాన్ని మనం నమ్ముకున్నట్టయితే, మన కండ్లతో మనం స్వయంగా చూచినా వాటిని మనం నమ్మం (లూకా 16:31 చూడు).

## ముగింపు

ప్రభువైన యేసు చేసిన అద్భుతాలు కొన్ని ప్రాముఖ్యమైన పాఠాలను నేర్పుతాయి. ఉదాహరణకు, క్రీస్తు యితరుల సమస్యల విషయంలో అక్కరగలవాడైయున్నట్టు అవి ప్రదర్శిస్తాయి. మనకు ఏ విధమైన సమస్య ఉండినా, క్రీస్తు కరుణతో చలిస్తాడు. అతి ముఖ్యమైనది, యేసు దేవుని కుమారుడని అద్భుతాలు బోధిస్తాయి. అందును బట్టి మనం పాపమునుండి రక్షింపబడే – ఒకనాడు నిత్యత్వంలో ఆయనతో పాటు నిరంతరం ఉండే అవకాశానికి ద్వారం తెరువబడియుంది!

యేసు దేవుని కుమారుడని నీవు నమ్ముతున్నావా? ఆయన నీ పాపములకొరకు మరణించాడని నీవు నమ్ముతున్నావా (1 కొరింథీ. 15:3)? ఈ విశ్వాసము నీ హృదయంలో మారుమనస్సును కలిగించిందా (అపొ. 17:30)? నీవు ఆయనయందలి నీ విశ్వాసాన్ని ఒప్పుకొని బాప్తిస్మమందు నీవు క్రీస్తును ధరించుకొనడానికి యిష్టపడుతున్నావా (రోమా 10:9, 10; గలతీ. 3:26, 27)? నీవు నిజంగా యేసునందు విశ్వాసముంచినట్టయితే, నేడే నీ విశ్వాసాన్ని ప్రదర్శించు.

---

సూచనలు

[1]మత్తయి పిలుపును మినహాయించి, వారపు పఠనానికి కావలసిన విషయం క్లుప్తంగా వివరించబడింది. [2]Abilene Christian University (then Abilene Christian College) in Abilene, Texas. [3]మనం చదివిన ఇతర స్వస్థతలో కూడ వెంటనే స్వస్థతపొందడం ఇమిడియుంది.